


నేడు కదిరికి బివి.రాఘవులు రాక

ప్రజాశక్తి-కదిరి టౌన్



సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు మంగళవారం నాడు కదిరికి విచ్చేస్తున్నట్లు ఆ పార్టీ పట్టణ కార్యదర్శి జిఎల్.నరసింహులు తెలిపారు. 2018 సంవత్సరంలో నంబులపూలకుంట మండలంలో ఏర్పాటుచేసిన సోలార్ ప్రాజెక్టు పరిహార పంపిణీలో అర్హులైన రైతులకు న్యాయమైన పరిహారం అందించాలని కోరుతూ రైతులకు మద్దతుగా పోరాటం జరిగిందన్నారు. ప్రజా సంఘాలు, రైతులు చేపట్టిన పోరాటంలో బివి.రాఘవులు పాల్గొన్నారన్నారు. ఉద్యమానికి సంబంధించి పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారన్నారు. ఆ కేసు కోర్టు వాయిదా నిమిత్తం రాఘవులు నేడు కదిరికి విచ్చేస్తున్నారని చెప్పారు.

అభివృద్ధిని మరచిన ముఖ్యమంత్రి

- నాలుగేళ్లలో నాలుగు పనులు కూడా చేయలేదు..
- బీసీ, మైనార్టీలకు సమాన అవకాశాలు కల్పిస్తాం
- యువగళం పాదయాత్రలో నారా లోకేష్



పాదయాత్ర సందర్భంగా మహిళా కూలీలతో నారా లోకేష్

ప్రజాశక్తి-కదిరి టౌన్

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు గడిచినా కనీసం నాలుగు అభివృద్ధి పనులు చేయని ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఎద్దేవా చేశారు. లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర కదిరి నియోజకవర్గంలో సోమవారం 48వ రోజు కొనసాగింది. మండల పరిధిలోని జోగన్నపేట విడిది కేంద్రం నుంచి నారా లోకేష్ యువగళం పాదయాత్ర 48వ రోజు సోమవారం ఉదయం10-30గం॥లకు ప్రారంభం అయ్యింది. అల్లుగుండు వద్ద టిడిపి నాయకులు, కార్యకర్తలు లోకేష్‌కు మంగళ హారతులతో ఘనస్వాగతం పలికారు. మొటుకుపల్లి గ్రామం వద్ద దివ్యాంగ పిల్లలతో కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కౌలేపల్లి వద్ద కూడా లోకేష్‌కు ఘనస్వాగతం లభించింది. పివిఆర్ ఫంక్షన్ హాల్‌లో బీసీలతో ముఖాముఖి కార్యక్రమం, ముస్లిములతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నల్లచెరువు నుంచి కదిరి మండలంలోకి లోకేష్ పాదయాత్ర ప్రవేశించింది. కదిరి పట్టణం పివిఆర్ ఫంక్షన్ హాల్ నందు ఏర్పాటు చేసిన బీసీలు, ముస్లింల ముఖాముఖి కార్యక్రమంలో లోకేష్ పాల్గొన్నారు. బీసీలు ముస్లింలు ఆ వర్గాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వీటిపై లోకేష్ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం



మహిళతో మాట్లాడుతున్న లోకేష్

అధికారంలోకి రాగానే బీసీ కులాలకు చెందిన ప్రతి ఒక్కరికీ సమన్యాయం చేస్తామని, దామాషా ప్రాతిపదికన చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. బీసీల పక్షపాతిగా గొప్పలు చెప్పుకుంటున్న కట్టింగ్, ఫిట్టింగ్ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. రైతులకు ఇన్పుట్ సబ్సిడీ, పంట నష్ట పరిహారం, వంటి పథకాలు అమలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు ఇన్పుట్ సబ్సిడీ డ్రిప్ ఇరిగేషన్, ఉద్యాన పంటల కోసం ప్రోత్సాహకం అందజేస్తామని భరోసా కల్పించారు. ముస్లిములకు దుల్హన్ పథకం, విదేశీ విద్య, మైనార్టీ కమ్యూనిటీ హాల్లో, కదిరిలో మైనార్టీల కోసం, వర్క్ బోర్డ్ ఆస్తులు పరిరక్షిస్తామని చెప్పారు. డిగ్రీ, డీఎడ్, విదేశీ విద్య అభ్యసించే విద్యార్థులకు విదేశీ విద్యా పథకం అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థికి డిక్లరేషన్ ఫామ్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేసిన ఘనత ఈ ప్రభుత్వానిక దక్కుతుందన్నారు. లోకేష్ పాదయాత్రకు స్వర్ణకారులు, నాయి బ్రాహ్మణులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో కదిరి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్, అత్తర్ చాంద్ బాషా, పరిటాల శ్రీరామ్, సబితమ్మ, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, బీసీ, మైనార్టీ నాయకులు, టిడిపి మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి పతనం తప్పదు..!

జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీల నిరసన

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్



పుట్టపర్తి కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న సిఐటియు, అంగన్‌వాడీ కార్యకర్తలు

ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయమని శాంతియుతంగా నిరసన తెలిపితే అక్రమంగా అరెస్టులు చేయడం దుర్మార్గమని ఇలాంటి ప్రభుత్వానికి భవిష్యత్తులో పతనం తప్పదని సిఐటియు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు హెచ్చరించారు. విజయవాడలో అక్రమ అరెస్టులను నిరసిస్తూ, అంగన్వాడీ వర్కర్లు, ఆయాల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయాల ఎదుట సోమవారం నాడు నిరసన తెలిపారు. పుట్టపర్తి కలెక్టరేట్ ముందు అంగన్వాడీలు ఆయాలు పెద్ద సంఖ్యలో నిరసన తెలిపారు. అంగన్వాడీలు మండే ఎండను సైతం లెక్క చేయకుండా గంటల తరబడి కలెక్టర్ కార్యాలయం ముందు బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్ మాట్లాడుతూ న్యాయమైన సమస్యలను పరిష్కారించాలని ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్లేందుకు విజయవాడకు వెళ్లిన అంగన్వాడీ కార్యకర్తలను ప్రభుత్వం పోలీసులు ద్వారా బలవంతంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికం అన్నారు. సమస్యలను పరిష్కరించకపోగా ప్రభుత్వం కక్ష సాధింపునకు దిగుతోందని మండిపడ్డారు. విజయవాడలో అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాజ్యుటీ ఇవ్వాలన్నారు. ఫేస్‌యాప్‌ను వెంటనే రద్దు చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం పుట్టపర్తి ఆర్డీవో భాగ్యరేఖకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు లక్ష్మీనారాయణ, దిల్షాద్, అంగన్వాడీ జిల్లా నాయకురాలు ఉషతో పాటు వివిధ మండలాల నుంచి అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ సమస్యలపై ఆందోళన ఉదతం చేస్తాం... సిఐటియు

పెనుకొండ : అక్రమంగా అరెస్టు చేసిన సిఐటియు నాయకులు, అంగన్వాడీ వర్కర్స్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం నాడు ఆ సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించమని అడిగితే ప్రభుత్వం అరెస్టులు చేయడం దుర్మార్గం అన్నారు. వెంటనే అరెస్టు చేసిన వారిని విడుదల చేసి, ఎన్నికల ముందు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వజ్రం నాగప్ప, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్దన్న, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు మాబున్నీస, జయమ్మ, జయతుంబి, పార్వతి, అంగన్వాడీ వర్కర్స్ పాల్గొన్నారు.



విద్యాశాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పకడ్బందీగా పది పరీక్షలను నిర్వహిస్తాం

కలెక్టర్ బసంత్ కుమార్

ప్రజాశక్తి-కొత్తచెరువు

ఏప్రిల్ 3వ తేదీన ప్రారంభమయ్యే 10వ తరగతి పరీక్షలను పగడ్బందీగా నిర్వహిస్తామని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్ అన్నారు. మండల కేంద్రమైన కొత్తచెరువులోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో మంగళవారం రాగిజావా పంపిణీ కార్యక్రమం సందర్భంగా ఏర్పాట్లను కలెక్టర్ సోమవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పది పరీక్షలు ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష సెంటర్ల దగ్గర 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్య సాయి జిల్లా విద్యాశాఖ అధికారిని మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో పోలీసు 'స్పందన'

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ ఆధ్వర్యంలో సోమవారం నాడు స్పందన అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలమూలల నుంచి వచ్చిన 36 మంది వివిధ సమస్యలపై ఎస్పీకి అర్జీలను అందించారు. ప్రతి అర్జీదారునితో ఎస్పీ ముఖాముఖి మాట్లాడారు. భూతగాదాలు, కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఉద్యోగ మోసాలు, భూవివాదాలు తదితర సమస్యలపై అర్జీలు అందాయి. చట్టపరిధిలో సమస్యలకు తక్షణం పరిష్కారం చూపాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. స్పందన ఫిర్యాదులపై నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా త్వరితగతిన పరిష్కారాలు చూపాలని ఆదేశించార. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కెవి.రామకష్ణ ప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'పది' ప్రశ్నాపత్రాలు మండలాలకు తరలింపు

ప్రజాశక్తి-కొత్తచెరువు

ఏప్రిల్ 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదోతరగతి పరీక్షలకు సంబంధించి ప్రశ్నాపత్రాలను సోమవారం నాడు అన్ని మండల కేంద్రాలకు తరలించినట్లు డీఈవో మీనాక్షి తెలిపారు. కొత్తచెరువు బాలుర ఉన్నత పాఠశాల స్టాక్ రూములో భద్రపరిచిన ప్రశ్నాపత్రాలను సోమవారం నాడు భారీ బందోబస్తు నడుమ మండల కేంద్రాలకు పంపామన్నారు. ఆయా పోలీసు స్టేషన్లలో వీటిని భద్రపరుస్తామని చెప్పారు.

ఏపీఆర్ఎస్ గణిత ఉపాధ్యాయునికి రాష్ట్రస్థాయి అవార్డు

పరిగి : మండలంలోని కోడిగెనహళ్లి ఏపీఆర్ఎస్ పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న అరుణ్ కుమార్‌కు 49వ గణిత ఒలంపియాడ్‌లో రాష్ట్ర స్థాయి ఉత్తమ గణిత ఉపాధ్యాయ అవార్డు వచ్చిందన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మురళీధర్ బాబు ఆయన్ను అభినందించారు. గురుకుల ప్రతిభా పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనపరచి రాష్ట్ర స్థాయిలో 9 ర్యాంకును కైవసం చేసుకున్నామన్నారు. విద్యార్థులను ప్రోత్సహించిన గణిత ఉపాధ్యాయుడు అరుణ్‌కుమార్‌ను సన్మానించారు.

మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌కు వేలంపాట



వేలం పాట నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు, ఛైర్‌పర్సన్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్ వద్ద నూతనంగా నిర్మించనున్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ గదులకు సంబంధించి సోమవారం నాడు మున్సిపల్ అధికారులు వేలంపాట నిర్వహించారు. మున్సిపల్ అధికారులు నిర్ణయించిన గుడ్‌విల్ అమౌంట్ కంటే రెండింతలు వేలంలో పాట పాడి వ్యాపారులు గదులను దక్కించుకున్నారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించబోయే స్థలంలో మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ లింగం నిర్మల, వైస్ ఛైర్మన్లు యర్రగుంట భాగ్యలక్ష్మి, పి.నాగరాజులు హాజరయ్యారు. తొలుత కాంప్లెక్స్ గ్రౌండ్‌ఫ్లోర్‌లోని దుకాణాల గదులకు గుడ్‌విల్ అమౌంట్ రూ.10,02,115గా మున్సిపల్ అధికారులు నిర్ణయించారు. వ్యాపారులు పలు గదులను అధిక ధరలకు వేలం పాట పాడి దక్కించుకున్నారు. వేలం పాటలో గ్రౌండ్ ఫ్లోర్‌కు సంబంధించిన దుకాణలను రూ.30లక్షల నుండి రూ. 50 లక్షల వరకు ఒక్కో గదిని పలువురు వ్యాపారులు దక్కించుకున్నారు.

పెరిగిన ఆదాయం

మొదటి అంతస్తుకు సంబంధించి గరిష్టంగా రూ.14లక్షల గుడ్‌విల్‌తో పలువురు వ్యాపారులు దుకాణాలను దక్కించుకున్నారు. ఈ వేలం పాటలో షాపింగ్ కాంప్లెక్స్‌కు సంబంధించి 15 గదులకు రూ.1,49,59,917గా మున్సిపల్ అధికారులు గుడ్‌విల్‌గా నిర్ణయిస్తే వ్యాపారులు వేలం పాట ద్వారా రూ.3,51,85,000కు పాట పాడి దుకాణాలను దక్కించుకున్నారు. షాపింగ్ కాంప్లెక్స్ ద్వారా ధర్మవరం పట్టణ చరిత్రలో ఇంత పెద్ద మొత్తంలో మున్సిపాల్టీకి ఆదాయం సమకూరడం ఇదే ప్రథమం. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ లింగం నిర్మల మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో మున్సిపాలిటి ఆధ్వర్యంలో నూతనంగా ఆధునిక సౌకర్యాలతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేలా ఎమ్మెల్యే కేతిరెడ్డి కషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్వో ఆనంద్, టూటౌన్ సిఐ రాజ, ట్రాఫిక్ సిఐ వహీద్ బాషా, ఎస్ఐ మహమ్మద్ రఫీ, పట్టణ సచివాలయ కన్వీనర్లు, కౌన్సిలర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార, గోరకాటి పురుషోత్తం రెడ్డి, గజ్జల శివ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో చైతన్యం తేవడానికే లోకేష్ పాదయాత్ర

మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న పల్లె రఘునాథ రెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రజా సమస్యలు తెలుసుకుని, వైసిపి అరాచక పాలనపై ప్రజల్లో చైతన్యం తేవడానికే టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర చేస్తున్నారని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పాదయాత్ర మంగళవారం నాడు పుట్టపర్తి నియోజకవర్గం పునగంపల్లికి మధ్యాహ్నం 2:30 గంటలకు చేరుకుంటుందన్నారు. నియోజకవర్గంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున లోకేష్‌కు స్వాగతం పలుకుతారన్నారు. ద్విచక్ర వాహనాలతో స్వాగతం పలికి సాయంత్రం వణుకువారిపల్లి వరకు లోకేష్ పాదయాత్ర చేస్తారన్నారు. ఉగాది పండగ పురస్కరించుకుని యువగళం పాదయాత్రకు మూడు రోజులపాటు విరామం ఉంటుందన్నారు. 25న తిరిగి వణుకువారిపల్లి నుంచి పాదయాత్ర ఓడిసికి చేరుకుంటుంద న్నారు. అక్కడ భారీ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. బహిరంగ సభకు నియోజక వర్గంలో ఆరు మండలాల నుంచి వేలాదిమంది పార్టీ శ్రేణులు అభిమానులు తరలి రానున్నారన్నారు. వైసిపి అరాచక దౌర్జన్య, అవినీతి పాలనకు చమర గీతం పాడెందుకు ప్రజలు సన్నద్ధలవుతున్నారన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన మాజీమంత్రి పల్లె

ఓబుళదేవర చెరువు : టిడిపి యువ నేత, ఆ పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర సోమవారం నాడు పుట్టపర్తి నియోజకవర్గం ఓబుళదేవరచెరువు మండలంలోకి ప్రవేశించనుంది. కదిరి నియోజకవర్గం నుంచి పుట్టపర్తి నియోజకవర్గం నల్లమాడ మండలంలోని పులగంపల్లికి సోమవారం మధ్యాహ్నం 3గంటలకు లోకేష్ పాదయాత్ర చేరుకోనుంది. పాదయాత్రకు సంబంధించిన ఏర్పాట్లను మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. నారా లోకేష్‌కు భారీ ఎత్తున స్వాగతం పలికేందుకు టిడిపి శ్రేణులు ఇప్పటికే ఏర్పాట్లు చేసుకున్నారు. అక్కడి నుంచి ఓడి చెరువు మండలానికి వస్తారు. మిట్టపల్లి వద్ద వికలాంగులతో లోకేష్ ముఖాముఖి నిర్వహిస్తారు. వణుకువారిపల్లి వద్ద సోమవారం రాత్రికి బస చేస్తారు. ఉగాది సందర్భంగా లోకేష్ పాదయాత్రకు విరామం ఉంటుంది. 25న ఓడి చెరువు మండలంలోని వేమారెడ్డి పల్లి వద్ద బహిరంగ సభ జరగనుంది. వీటికి సంబంధించిన ఏర్పాట్లను మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి దగ్గరుండి పరిశీలిస్తున్నారు. ఓడిసి మండలంలోని అన్ని పంచాయతీల టిడిపి నాయకులు, కార్యకర్తలతో పాదయాత్ర విజయవంతంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నల్లమాడ, ఓడి చెరువు మండల కన్వీనర్లు మైలే శంకర్, జయ చంద్రతో పాటు ఓడి చెరువు మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తచెరువు : నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఈనెల 21వ తేదీ మంగళవారం పుట్టపర్తి నియోజకవర్గంలోకి ప్రవేశిస్తోందని, ఇందులో టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్.శ్రీనివాసులు, మండల కన్వీనర్ రామకష్ణ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని పెనుగొండ రోడ్డు శ్రీవిద్య కళాశాలలో టిడిపి నాయకులు, కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాదయాత్రకు సంఘీభావంగా కొత్తచెరువు నుంచి బుక్కపట్నం, పుట్టపర్తి మీదుగా ఓడీసీ వరకు బైక్ ర్యాలీ నిర్వహించి లోకేష్‌కు ఘన స్వాగతం పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి టౌన్ కన్వీనర్ శ్రీనివాసులు, మాజీ సర్పంచి వెంకటరమణప్ప, నాయకులు టీచర్ నాగేందర్ ప్రసాద్, బోయ రాజు, బండ్లపల్లి కిష్టప్ప, సురేష్, కొండపగానిపల్లె శివ, ఎన్ఎస్.శ్రీనివాసులు, బైరాపురం సర్పంచి రవికుమార్, ఆలకుంట శ్రీనివాసులు, షర్ఫుద్దీన్‌పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఏపి రైతుసంఘం నాయకులు

పంట నష్టపోయిన రైతులను ఆదుకోండి

ఏపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న

ప్రజాశక్తి -పెనుకొండ

ఇటీవల కురిసిన అకాల వర్షానికి పంట నష్ట పోయిన రైతులను ఆదుకోవాలని ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సబ్ కలెక్టర్ కె.కార్తీక్‌కు సోమవారం నాడు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని దుద్దేబండ, మోటువారిపల్లి, చంద్రగిరి, మునుమడుగు, గొల్లపల్లి తదితర గ్రామాల్లో అకాల వర్షాలకు వందలాది ఎకరాల్లో పంట దెబ్బతినిందన్నారు. తక్షణం నష్టపోయిన రైతులను గుర్తించి వారికి పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్దన్న, మండల సిఐటియు నాయకులు వజ్రం నాగప్ప, రైతులు పాల్గొన్నారు.

పంటనష్టంపై ప్రాథమిక అంచనాలు సిద్ధం

జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లాలో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటల నష్టాన్ని ప్రాథమిక అంచనా అధికారులు తయారు చేశారని జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు ఆవుటాల రమణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్‌తో కలిసి ఉద్యానవన శాఖ కార్యాలయంలో పంట నష్టంపై ప్రాథమిక అంచనాకు సంబంధించిన నివేదికను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో మొక్కజొన్న వేరుశనగ పొద్దుతిరుగుడు, రాగి పంటలు 416 హెక్టార్లలో నష్టం జరిగిందన్నారు. మామిడి, అరటి, టమోటా, బొప్పాయి, మిరప, కాయగూరల తోటలు దాదాపు 150 హెక్టార్లలో నష్టం వాటిల్లిందన్నారు. ఈ నివేదికను ప్రభుత్వానికి పంపుతామన్నారు. బాధిత రైతులకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా చూస్తామన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి-రొద్దం



విరగడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం

మండలంలోని ఆర్.మరవపల్లి బీసీ కాలనీలో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. నివాసాల వద్ద ఉన్న విద్యుత్ స్తంభాలు ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. రొద్దం విద్యుత్ ఉపకేంద్రం నుంచి వచ్చిన 11 కెవి లైన్ ఎంపియుపి పాఠశాల ముందు ఉన్న స్తంభం, దాని పక్కనే ఉన్న మరో రెండు స్తంభాలను గత 20 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అవి పాతబడి కిందకు వాలాయి. ఈ స్తంభాలపై వెళ్తున్న విద్యుత్ తీగులు కూడా పాఠశాల చెట్లకు తగులుతున్నాయి. వర్షం వచ్చిన సమయంలో విద్యార్థులు ఆ చెట్లను తాకితే విద్యుత్ షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. పూర్తిగా పాడైన విద్యుత్ స్తంభాలు గాలివాన వస్తే కిందకు పడేలా ఉన్నాయి. విద్యుత్ అధికారులు స్పందించి ప్రమాదరకంగా మారిన ఈ విద్యుత్ స్తంభాలను తక్షణం మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



లోకేష్‌తో కరచాలనం చేస్తున్న వేణు

నారా లోకేష్‌ను కలిసిన టిడిపి జిల్లా కార్యదర్శి వేణు

గోరంట్లటౌన్ : టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్‌ను పుట్టపర్తి జిల్లా టిడిపి జిల్లా కార్యదర్శి వేణుగోపాల్ రాయల్ సోమవారం నాడు కలిశారు. కదిరి నియోజకవర్గంలో పాదయాత్ర చేస్తున్న లోకేష్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం ఆయనతో కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

పెనుకొండ : మండలంలోని దుద్దేబండ, వెంకటగిరిపాళ్యం, ఆర్‌బికెల పరిధిలో ఇటీవల వడగళ్ల వర్షానికి దెబ్బతిన్న రైతుల పొలాలను సోమవారం నాడు పెనుకొండ సహాయ వ్యవసాయ సంచాలకులు స్వయంప్రభ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పంట నష్టపోయిన ప్రతి రైతు పొలాన్ని సందర్శించి, నష్టాన్ని అంచనా వేయాలని సూచించారు. ఈ నెల 25 తేదీ లోపు నష్ట జాబితాను పెనుకొండ మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో అందజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సురేంద్ర నాయక్, ఏఈఓ, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పంటనష్టం జాబితా సిద్ధం

గాండ్లపెంట : మండల పరిధిలోని సోమయాజులపల్లి సచివాలయం పరిధిలోని శుక్రవారం రాత్రి కురిసిన వడగండ్ల వర్షానికి నష్టపోయిన పంట నష్టం జాబితాను రైతు భరోసా కేంద్రాల వారీగా తయారు చేసినట్లు సచివాలయం అగ్రికల్చర్ అసిస్టెంట్ తరుణ్ తెలిపారు. బూడిద గుమ్మడి, టమోటా, బొప్పాయి, చామంతి తదితర పంటలు పరిశీలించి 15 ఎకరాల్లో పంట నష్టపోయినట్లు గుర్తించామన్నారు. ఈ జాబితాను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు.

29న బత్తలపల్లి మండలమీట్

బత్తలపల్లి : బత్తలపల్లి మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 29వ తేదీన బత్తలపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో సాయిమనోహర్ తెలిపారు. ఎంపీపీ గజ్జెల వెంగళరెడ్డి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి మండల ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

పొగాకుతో నోటి క్యాన్సర్

ప్రజాశక్తి-మడకశిర రూరల్

పొగాకు నమలడం వల్ల నోటి క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని దంత వైద్యురాలు సుజాత పేర్కొన్నారు. రొళ్ల మండల కేంద్రంలోని సామాజిక ఆసుపత్రి వద్ద ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. నోటి క్యాన్సర్ నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సజన, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు సామగ్రి పంపిణీ

లేపాక్షి : మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో పనిచేసే కార్మికులకు వ్యక్తి గత పరి శుభ్రత కోసం సర్పంచ్ ఆదినారాయణ ఆధ్వర్యంలో బట్టలు, సోప్‌లు, కొబ్బరి నూనె తదితర సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వీటిని పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగేంద్ర, కార్మికులు అశ్వర్థనారాయణ, రామాంజి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తనకల్లు : మండల పరిధిలోని గందోడివారిపల్లికి చెందిన జనసేన పార్టీ కార్యకర్త శంకర్ గతవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. జనసేన పార్టీకి సభ్యత్వం ఉండటంతో జిల్లా కదిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ భైరవ ప్రసాద్ మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. శంకర్ కుటుంబానికి కొక్కంటి క్రాస్ కు చెందిన జనసేన పార్టీ నాయకులు రూ.15,000 అందించారు. ఈ కార్యక్రమంలో లాయర్ భైరవ ప్రసాద్ , దేగల మహేష్, కొట్టి అశ్వర్థ కుమార్, కెవి.రమణ పాల్గొన్నారు.

సజావుగా ఇంటర్ పరీక్షలు

రొద్దం : మండలంలోని జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షలు సజావుగా సాగుతున్నాయి. సోమవారం నాడు ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు 92 మంది విద్యార్థులకు గాను 90మంది హాజరయ్యారు. ఇద్దరు గైర్హాజరైనట్లు ప్రిన్సిపల్ విజయలక్ష్మి తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద ఎస్ఐ నాగస్వామి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

నేతాజీ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

హిందూపురం: పట్టణం లోని నేతాజీ ఉన్నత పాఠశాలలో సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 1982-1983వ సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు. 40 సంవత్సరాల అనంతరం అప్పటి గురువులు, విద్యార్థులు ఆనాటి విషయాలను నెమరుకుంటూ సంతోషాన్ని వ్యక్తం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు బస కల్యాణ జనికిరామా రావు, ఇతర ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

యువగళం పాదయాత్రను విజయవంతం చేద్దాం

సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు బికె.పార్థసారథి

ప్రజాశక్తి-సోమందేపల్లి

నారా లోకేష్ ఆధ్వర్యంలో జరుగుతున్న యువగళం ఈ నెల 28, 29వ తేదీల్లో సోమందేపల్లి మండలంలో జరుగుతుందని, ఈ పాదయాత్రలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని శ్రీ సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు బికె.పార్థసారధి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పార్థసారధి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలు విజయంతో టిడిపి నాయకులు, కార్యకర్తలపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. 2024లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యేలా ప్రతి ఒక్కరూ ఇప్పటి నుంచి కృషి చేయాలని పిలుపునిచ్చారు. యువగళం పాదయాత్ర గతంలో మాదిరి కాకుండా స్వల్ప మార్పులు చేశామన్నారు. ఈనెల 28న గోరంట్ల మండలం నుంచి సోమందేపల్లి మండలంలోకి పాదయాత్ర ప్రవేశిస్తుందని చెప్పారు. మండలంలోని నల్లగొండరాయనపల్లి వద్ద రాత్రి బస చేసి 29న ఉదయం పాదయాత్రగా బయలుదేరి పెనుకొండకు వెళ్తారన్నారు. ప్రతి పంచాయతీ, గ్రామం నుంచి పెద్ద ఎత్తున టిడిపి కార్యకర్తలు, మహిళలు పాల్గొని లోకేష్ పాదయాత్ర విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. అనంతరం లోకేష్ బస చేసే ప్రాంతాన్ని నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ సిద్దలింగప్ప, నాయకులు భానుకీర్తి, నీరుగంటి చంద్రశేఖర్, సంజీవరెడ్డి, సురేష్, కిష్టప్ప, నాగమణి, అశ్వర్థ, ఆనంద్, గోపాల్ యాదవ్, సూరీ, హరికష్ణ, ఆంజనేయులు, హనుమంతు, రామాంజినేయులు, సంజయ్, అమర్నాథ్, మద్దిలేటి, అనసూయమ్మ, నరసింహమూర్తి, ప్రసాద్, నారాయణప్ప, బాబయ్య, భానుమూర్తి, సోము, శ్రీనివాసులు, శ్రీరాములు, బాలు, మైలార్ యాదవ్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి

నారా లోకేష్ రూట్ మ్యాప్ పరిశీలన

గోరంట్ల టౌన్ : గోరంట్ల మండలంలో టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ ఈనెల 26న యువగళం పాదయాత్ర నిర్వహించనున్నారు. ఈ మేరకు పాదయాత్ర రూట్‌మ్యాప్‌ను మాజీ ఎమ్మెల్యే బికె.పార్థసారథి సోమవారం పరిశీలించారు. మండలంలోని గౌనివారిపల్లి, గుమ్మయగారిపల్లి, పాలసముద్రం, మల్లాపల్లి గ్రామాల్లో పర్యటించారు. లోకేష్ ఆయా గ్రామాల్లో ప్రజలతో మాట్లాడే ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ సోమశేఖర్, హిందూపురం పార్లమెంట్ టిడిపి జిల్లా కార్యదర్శి నరసింహులు, జిల్లా కార్యదర్శి వేణు, మండల ప్రధాన కార్యదర్శి అశ్వర్థరెడ్డి, వెంకటరెడ్డి, ఉత్తమ రెడ్డి, బొబ్బిలి రామ్మోహన్, చంద్ర నాయక్ పాల్గొన్నారు.

పరిగి : టిడిపి యువ నాయకుడు నారా లోకేష్ చేపడుతున్న యువ గళం పాదయాత్రలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే బికె.పార్థసారథి పిలుపునిచ్చారు. పరిగి మండల కేంద్రంలోని భీరలింగేశ్వర కళ్యాణ మండపంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈనెల 27న గోరంట్ల మండలంలోకి లోకేష్ పాదయాత్ర ప్రవేశిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాజీ ఎంపిపి సత్యనారాయణ, లక్ష్మారెడ్డి, శేఖర్, ఈశ్వరప్ప, చౌడప్ప, హనుమయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై కక్ష సాధింపు మానుకోండి

యుటిఎఫ్ గౌరవాధ్యక్షులు కె.భూతన్న

ప్రజాశక్తి -మడకశిర

రాష్ట్రవ్యాప్తంగా వివిధ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులపై ప్రభుత్వం ఇప్పటికైనా కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు భూతన్న తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రంలో ఇటీవల యుటిఎఫ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. మడకశిర ప్రాంతానికి చెందిన ఉపాధ్యాయుడు భూతన్నను జిల్లా గౌరవ అధ్యక్షులుగా తీసుకున్నారు. సోమవారం నాడు పట్టణంలో ఐదు మండలాల పరిధిలో ఉంటున్న యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన నాలగేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులను తీవ్ర నిర్లక్ష్యానికి గురి చేస్తోందని చెప్పారు. ప్రతి విషయంలోనూ ఒత్తిడి పెంచి తీవ్ర మానసిక వేదనకు గురి చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలల విలీనం పేరుతో విద్యా వ్యవస్థను కూడా నాశనం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమస్యలన్నింటిపై యుటిఎఫ్ పోరాటాలు సాగిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మడకశిర మండల యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాలింగప్ప, మూడ్లగిరియప్ప, ఉపాధ్యక్షులు జోగప్ప, గుడిబండ మండల అధ్యక్షులు నరసింహప్ప, శివ నాయక్, ఈశ్వర్ నరసింహమూర్తి, నంజప్ప, సూర్య ప్రకాష్, వి.హనుమంతరాయ్, కెటి.హనుమంతరాయ, ఓబన్న, మహంతేష్, వెంకట నాయక్, ఉగ్ర నరసింహ, రంగనాథ్ పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

ప్రజాశక్తి-హిందూపురం

నోరు ఎంత ఆరోగ్యంగా ఉంటే శరీరం అంతే ఆరోగ్యగంగా ఉంటుందని జిల్లా అసుపత్రి మెడికల్ సుపరిటెండెంట్ డాక్టర్ రోహిల్ కుమార్ పేర్కొన్నారు. ప్రపంచం నోటి ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లా అసుపత్రి దంత వైద్య నిపుణులు విజయ్ బాబు ఆధ్వర్యంలో వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రభుత్వ అసుపత్రి నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు నోటి శుభ్రతపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాత శిశు అసుపత్రిలోని సెమినార్ హాల్‌లో సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నోటి శుభ్రతపై పలు విషయాలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దంతవైద్యులు డా॥అపర్ణ దంత వైద్య సిబ్బంది లోకేష్, చైతన్య, ఆరోగ్య, ఆశా, కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

దళితుల శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని వినతి

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండ నియోజకవర్గం రొద్దం మండలంలోని కోగిర గ్రామానికి చెందిన దళితుల శ్మశానవాటిక కోసం సర్వేనెంబర్ 559 నందు స్థలం కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్‌కు సోమవారం నాడు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ కోగిరి గ్రామంలో ప్రభుత్వం భూమి కొని ఇవ్వాల్సిన అవసరం లేకుండా గ్రామ సరిహద్దునే ప్రభుత్వ భూమి ఉందని, కొంతమంది రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో తహశీల్దార్ దీనిని ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వ భూమిని కాకుండా వంకలు, వాగులను చూపిస్తూ దళితులను అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన సబ్ కలెక్టర్ వెంటనే తహశీల్దార్‌తో మాట్లాడి, రికార్డు పరిశీలించి దళితుల అభిప్రాయం మేరకు 559 సర్వే నంబర్‌లో భూమిని శ్మశాన వాటికకు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు నారాయణ, గ్రామ దళితులు రాము, గంగప్ప, అంజనప్ప పాల్గొన్నారు.



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎపి వ్యకాసం నాయకులు



ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

ప్రహరీ ఏర్పాటుకు ఆర్థికసాయం

కదిరి టౌన్ : కదిరి రూరల్ మండలం కుమ్మరవాండ్లపల్లి మసీద్ ఏ రసూల్ ప్రహరీ నిర్మాణంకు వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ ఆర్థిక సాయం అందజేశారు. ఈ మేరకు పారిశ్రామిక వాడలోని మసజీద్ ఏ రసూల్ ముతవల్లి, మసీదు పెద్దలు హరిప్రసాద్‌ను కలిసి ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఇందుకు స్పందించిన ఆయన రూ.50వేలు అందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కె.ఎస్.బహవుద్దీన్, వైస్ ఎంపిపి బత్తల ఆదినారాయణ, ముతవల్లి టిఎం రఫీక్, ఇండస్ట్రియల్ ఛైర్మన్ నౌషాద్, ముబారక్, అఖిల్, సూరినేని కిరణ్ మెహబూబ్, జహా, కిరణ్ పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు : సిఐటియు

ప్రజాశక్తి-లేపాక్షి

మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం నాడు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ నిరసన తెలిపితే ప్రభుత్వం బలవంతంగా అరెస్టు చేయడం దుర్మార్గం అన్నారు. అరెస్టులకు భయపడేది లేదన్నారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిన ముఖ్యమంత్రి అధికారంలోకి రాగానే వాటిని ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ఉద్యోగ భద్రత, ఉద్యోగ విరమణ సదుపాయాలు, ఫేస్ యాప్ రద్దు తదితర డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ప్రవీణ్ కుమార్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు భాగ్యమ్మ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : కనీస వేతనాలు, ఇతర సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమని సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప పేర్కొన్నారు. చలో విజయవాడ సందర్భంగా అంగన్వాడి వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చలో విజయవాడ కార్యక్రమానికి అంగన్వాడి వర్కర్లు వెళ్లకుండా రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను ఉసిగొలిపి ఎక్కడిక్కడ అక్రమ అరెస్టులు చేయడాన్ని నిరసిస్తు సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నరసింహప్ప మాట్లాడుతూ అంగన్వాడి వర్కర్ల సమస్యలను పరిష్కరించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం అందుకు విరుద్ధంగా అంగన్వాడి వర్కర్లను ఎక్కడికక్కడ అక్రమ అరెస్టులు చేయించడం ఎంత మేరకు సమంజసమన్నారు. ప్రశ్నించే గొంతుకులను నొక్కువేయాలని చూడటం హాస్యాస్పదమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కోశాధికారి రామకష్ణ, పట్టణ కమిటీ సభ్యులు చంద్ర, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మల్లికార్జున, ఐరన్ ఫర్నీచర్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి జబివుల్లా, రఘు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



హిందూపురంలో ఆందోళన చేస్తున్న సిఐటియు నాయకులు

అధునిక టెక్నాలజీతో 'విజేత స్టూడియో అండ్ కలర్ ల్యాబ్'



విజేత స్టూడియో అండ్ కలర్‌ల్యాబ్

గోరంట్లటౌన్ : పట్టణంలోని స్టేట్ బ్యాంకు కాంప్లెక్స్‌లో సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో విజేత స్టూడియో, కలర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశామని ప్రొప్రైటర్ ప్రతాప్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ విజేత స్టూడియో అండ్ కలర్ ల్యాబ్ గోరంట్లలో మొట్టమొదటిసారిగా ప్రారంభించామన్నారు. వివాహాలు, ఇతర శుభకార్యాలకు సంబంధించి అత్యాధునికి సాంకేతిక పరిజ్ఞానంతో వీడియోలు, ఫొటోలు తీస్తామని చెప్పారు. డ్రోన్ కెమెరాతో వీడియోలు తీయనున్నట్లు చెప్పారు. కలర్, పాస్‌ఫొటోలను త్వరితగతిన అందిస్తామని చెప్పారు. క్లారిటీ మిక్సింగ్ చేసి ఫొటోలను ఇస్తామన్నార. ఇండోర్, అవుట్ డోర్ కార్యక్రమాలను కూడా తమ స్టూడియో ద్వారా నిర్వహిస్తామని ప్రతాప్ రెడ్డి తెలిపారు.

జీవో 1ని రద్దు చేయాల్సిందే..

ప్రజాశక్తి-కదిరి టౌన్

రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా తీసుకొచ్చిన చీకటి జీవో 1ని తక్షణం రద్దు చేయాలని సిపిఎం, సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నాడు కదిరి పట్టణంలో వేమారెడ్డి సర్కిల్ సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో జీవో 1 ప్రతులను దహనం చేసి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా కార్యదర్శి సుబ్బిరెడ్డి, జిఎల్.నరసింహులు, సిపిఐ నాయకులు కదిరప్ప తదితరులు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసేలా రాష్ట్ర ప్రభుత్వం చీకటి జీవోలను తెస్తోందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం పై వస్తున్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకు జీవో నెంబర్ 1ని ప్రతిపక్ష పార్టీల గొంతునొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం జీవో 1ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా నాయకులు మధు, రైతు సంఘం నాయకులు మధు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రమణ, పట్టణ సహాయ కార్యదర్శి మనోహర్, సిపిఐ నాయకులు శీనా, ముబారక్, శంకర్ రెడ్డి, తిప్పన్న, సిపిఎం నాయకులు జగన్మోహన్, ముస్తాక్, ఎఐఎస్ఎఫ్ నాయకులు ఉపేంద్ర వంశీ పాల్గొన్నారు.

బెల్ నిర్వాసిత రైతులకు పునరావాసం కల్పించండి

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలోని చిన్నబాబయ్యపల్లి గ్రామానికి చెందిన రైతులు బెల్ కంపెనీ కోసం భూములు కోల్పోయారని, వారికి పునరావాసం కల్పించి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నాడు మండల తహశీల్దార్ మురళీకష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బెల్ నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం మేరకు పునరావసం కల్పించాలని రైతులు హైకోర్టును ఆశ్రయించినట్లు చెప్పారు. రైతులకు న్యాయం చేయాలని హైకోర్టు చెప్పిందన్నారు. అయినా అధికారులు హైకోర్టు ఉత్తర్వులను పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశులు, సిఐటియు మండల నాయకులు కొండా వెంకటేశులు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు నాగభూషణ, చేనేత కార్మిక సంఘం మండల నాయకులు శీలా నారాయణస్వామి, భూనిర్వాసిత రైతులు పాల్గొన్నారు.

యువగళం పాదయాత్రలో సవితమ్మ

ప్రజాశక్తి -పెనుకొండ

కదిరి నియోజకవర్గం జోగన్నపేట నుంచి టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సవితమ్మ సోమవారం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సవితమ్మ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అన్నా క్యాంటీన్

పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సవితమ్మ ఆధ్వర్యంలో చేపట్టిన అన్నా క్యాంటీన్ సోమవారం 37వరోజు కొనసాగింది. సవితమ్మ కార్యాలయం వద్ద 5 రూపాయలకే భోజనంను ప్రజలకు అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుట్టూరు సూర్యనారాయణ, త్రివేంద్ర నాయుడు, ఆడదాకులపల్లి ప్రసాద్, బాలాజీ నాయక్, వాసుదేవ రెడ్డి పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసితులకు న్యాయం చేయండి

ప్రజాశక్తి-చిలమత్తూరు



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గ్రీన్ ఫీల్డ్ హైవేకి భూమిని కోల్పోనున్న రైతులకు ప్రస్తుత మార్కెట్ ధరకు మూడు రెట్లు అదనంగా నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని వ్యకాసం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ అన్నారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ మండలం ఇప్పటికే అనేకసార్లు సెజ్ పేరుతో భూములు తీసుకున్నారన్నారు. మరోసారి నేషనల్ హైవే పేరుతో రైతులకు ఉన్న అరకొర భూమిని తీసేసుకుంటే రైతులు జీవనాధారాన్ని కోల్పోతారని తెలిపారు. గతంలో సెజ్‌కు భూములు కోల్పోయిన రైతులు జీవనాధారం కోల్పోవడంతో బెంగళూరు వంటి నగరాలకు వలసవెళ్లి అక్కడ దుర్భరమైన జీవితం గడుపుతున్నారని తెలిపారు. రైతులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వడంతో పాటు, మరో చోట భూమిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో డీటీ హనుమంతుకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఫిరంగి ప్రవీణ్ కుమార్, లక్ష్మీనారాయణ, రమేష్, నరసింహులు, రైతులు పాల్గొన్నారు.

రీ సర్వేతో యజమానులకు 'భూరక్ష'

ప్రజాశక్తి-బత్తలపల్లి

వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ద్వారా చేపడుతున్న రీ సర్వేతో యజమానులకు ఆస్తి హక్కుపై మరింత భద్రత ఉంటుందని ఎంపిపి గజ్జెల వెంగళరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గంగలపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు- భూరక్ష పథకంపై గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి, రెవెన్యూ రికార్డులను అనుసంధానం చేయడానికి సమగ్ర భూసర్వే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. విఆర్‌ఒ నరసింహులు మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా రీ సర్వే చేసి ప్రభుత్వం ఆస్తులు, ప్రయివేటు ఆస్తులు, బహిరంగ స్థలాలను గుర్తించనున్నట్లు తెలిపారు. సర్వే పూర్తయిన తరువాత డిజిటలైజేషన్ పద్ధతిలో -క్యూఆర్ కోడ్‌తో భూహక్కు పత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కార్యదర్శి భారతి, సర్వేయర్ రవి వైఎస్సార్‌సీపీ నాయకులు చెన్నారెడ్డి. నాగిరెడ్డి, ఈశ్వరయ్య. ఆంజనేయులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల కేంద్రంలోని ఎన్టీఆర్ సర్కిల్ నుంచి కొత్తపల్లి క్రాస్ వరకు రోడ్డు విస్తరణ పేరుతో ఇరువైపులా ఉన్న డ్రెయినేజీని తొలగించారని, తక్షణం దీనిని ఏర్పాటు చేయాలని సిపిఎం నాయకులు కోరారు. ఈ మేరకు తహశీల్దార్ మురళీకష్ణను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. డ్రెయినేజీ లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వెంటనే అధికారులు స్పందించి నూతన డ్రైనేజీ ఏర్పాటు చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రాజగోపాల్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు బాలస్వామి, చేనేత కార్మిక సంఘం మండల నాయకులు గంగరాజు, చంద్రశేఖర్, సోషల్ మీడియా ఇన్చార్జ్ శ్రీకాంత్, ఆవాజ్ మండల అధ్యక్షులు మాబు, భవన నిర్మాణ నాయకులు ఆంజనేయులు పాల్గొన్నారు.

స్థానికులనే అంగన్వాడీ కార్యకర్తగా నియమించండి

ప్రజాశక్తి-కొత్తచెరువు

కొత్తచెరువులోని రెండో అంగనవాడీ కేంద్రంలో స్థానికులకే అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్.వెంకటేష్ కోరారు. ఈ మేరకు సోమవారం నాడు కలెక్టర్ బసంత్ కుమార్, ఐసిడిఎస్ పీడీ, సిడిపిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తచెరువు-2 కేంద్రంలో పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తకు సూపర్వైజర్‌గా ఇటీవల పదోన్నతి వచ్చిందన్నారు. ఈ స్థానంలో అక్కడ ఆయాగా విధులు నిర్వహిస్తున్న యమునకు ప్రభుత్వ జీవో ప్రకారం పదోన్నతి కల్పించి కార్యకర్తగా ఖాళీని భర్తీ చేయాలన్నారు. అలా కాకుండా బుక్కపట్నం మండలం పాముదుర్తి గ్రామానికి చెందిన సుకన్యను ఆ స్థానంలో నియమించారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా చేసిన ఈ నియామకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి : టీడీపీ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చాలని వాల్మీకి సంఘం సీనియర్ నాయకులు బోయ రవిచంద్ర డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో వాల్మీకి కులస్తుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ వాల్మీకులకు రాజకీయ చైతన్యం కల్పించింది టీడీపీవేన్నారు. మండలంలో వాల్మీకి కల్యాణమండపం, వాల్మీకి భవనంతో పాటు ఎస్టీ సాధన తదితర అంశాలపై ధర్మవరం నియోజకవర్గంలో చేపట్టే నారాలోకేశ్ యువగళం పాదయాత్రలో విన్నవిస్తామన్నారు. ధర్మవరం నియోజకవర్గం అభివద్ధితోపాటు ప్రశాంతంగా ఉండాలంటే పరిటాల శ్రీరామ్‌ను ఎమ్మెల్యేగా గెలిపించేందుకు వాల్మీకులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో వాల్మీకి సంఘం నాయకులు పోతుకుంట లక్ష్మన్న, గొట్లూరు శీన, బొట్టుకిష్ట, చీమల రామాంజి, పూలకుంట్ల మహేశ్, టైలర్ గోపాల్, మరుసహరి, మంజు పాల్గొన్నారు.

మండలానికి చేరిన 'పది' ప్రశ్నాపత్రాలు

లేపాక్షి : పదోతరగతి ప్రశ్నాపత్రాలు మండలానికి చేరాయని, వాటిని పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచినట్లు ఎంఇఒ నాగరాజు నాయక్ తెలిపారు. మండల పరిధిలో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అందులో ఓరియంటల్ పాఠశాలలో 217మంది, మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలో 200మంది, వివేకానంద జిల్లా పరిషత్ హై స్కూల్‌లో 240 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలియజేశారు.

పదునైన కవిత్వానికి చిరునామా 'ఉద్దండం'

ఉగాది పురస్కారంతో సత్కారం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

"సమాజాన్ని ప్రభావితం చేసే రచనలు చేస్తున్న యువ కవి డాక్టర్ ఉద్దండం చంద్రశేఖర్ పదునైన కవిత్వానికి చిరునామా అని సిబిఐ పూర్వ జాయింట్ డైరెక్టర్ వి.వి.లక్ష్మీనారాయణ ప్రశంసించారు. కర్ణాటక తెలుగు రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో బెంగళూరులోని కళ్యాణ్ నగర్ ఇండో ఏషియన్ విద్యా సంస్థల సెమినార్ హాల్లో శోభకతు నామ ఉగాది జాతీయ పురస్కారాల ప్రధానోత్సవ సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం నాగారెడ్డిపల్లికి చెందిన యువ కవి, తెలుగు పరిశోధకుడు డాక్టర్ ఉద్దండం చంద్రశేఖర్‌ను 'ఉగాది జాతీయ పురస్కారం 2023 ' ప్రధానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక తెలుగు రచయితల సమాఖ్య చైర్మన్ బి.మాల్యాద్రి సభకు అధ్యక్షత వహించారు. ఇండో ఏషియన్ విద్యాసంస్థల అధినేత ప్రొఫెసర్ ఏకాంబరం నాయుడు, బెంగళూరు విశ్వవిద్యాలయ తెలుగు శాఖ అధ్యక్షురాలు ఆచార్య కొలకలూరి ఆశాజ్యోతి, సమాఖ్య ప్రధాన కార్యదర్శి కళ్ళే వెంకటేశ్వర శాస్త్రి, అధ్యక్షులు వెంకట చండీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


పురస్కారం అందుకుంటున్న ఉద్దండం చంద్రశేఖర్

గోనుగుంట్ల విజయ్‌కుమార్‌కు సన్మానం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

బత్తలపల్లి మండలం మాల్యవంతం గ్రామానికి చెందిన గోనుగుంట్ల విజయ్కుమార్ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఇటీవల ఎంపిక కావడంతో ధర్మవరంటీడీపీ కార్యాలయంలో ఆయనను టీడీపీ నాయకులు సన్మానించారు. సోమవారం ధర్మవరంకు విచ్చేసిన గోనుగుంట్ల విజయ్కుమారు 25వ వార్డు టీడీపీ ఇన్చార్జ్ భీమనేని ప్రసాదానాయుడు, మండలఉపాధ్యక్షులు చిగిచెర్ల రాఘవరెడ్డి నాయకులు గంగాధర్, అం జి, అంకన్న, కాయలరామంజి,లక్ష్మీపతి, రాజు, శీన,రవి, అమర, సాయి, చిన్ననరసిం హులు శాలువాతో కప్పి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గోనుగుంట్ల విజయకుమార్ మాట్లాడుతూ... త్వరలో ధర్మవరం నియోకవర్గంలో అడుగుపెడుతున్న నారాలోకేశ్ యువగళం పాదయాత్రను విజయవంతంచేసే ప్రతి కార్యకర్త కషిచేయాలని సూచించారు.


టీడీపీ కార్యదర్శి గోనుగుంట్ల విజయకుమార్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

నోరు శుభ్రంగా ఉంటేనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-ఉరవకొండ

నోరు శుభ్రంగా ఉంటేనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని రాకెట్ల ప్రభుత్వ వైద్యాధికారులు పావని, దంత వైద్యులు రాజేశ్వరి అన్నారు. సోమవారం మండలంలోని అమిద్యాల స్కూల్‌లో ప్రపంచ నోటి ఆరోగ్య దినం (ఓరల్ హెల్త్ డే)పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరికైతే నోరు శుభ్రంగా ఉంటుందో వారి శారీరిక ఆరోగ్యం బాగుంటుందన్నారు. పళ్లు గార పట్టడం, పుచ్చిపోవడం, రాలిపోవడం వంటి సమస్యల కారణంగా ఎన్నో అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని వివరించారు. ఆహార పదార్థాలు నమిలేటప్పుడు నొప్పి పుట్టడం, సరిగా నమలకపోవడం వల్ల అజీర్తి, కడుపు నొప్పితోపాటు అనీమియా లాంటి రక్తహీనత సమస్యలు వస్తాయన్నారు. దంత వైద్యురాలు రాజేశ్వరీదేవి అనారోగ్య సమస్యలు ఉన్న 25 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి వైద్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్.ఎండి షఫీ,సచివాలయ ఏఎన్ యంలు కోమల,చాముండేస్వరి,సిఓ భగవాన్ దాస్ ప్రధానోపాధ్యాయులు పద్మావతి,ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట : విద్యార్థులు పళ్లను జాగ్రత్తగా శుభ్రం చేసుకోవాలని డాక్టర్ బాలాజీనాయక్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని మారంపల్లి పాఠశాలలో పంటి ఆరోగ్య పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పళ్ల శుభ్రం, లేకుంటే కలిగే నష్టాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు నోటిని శుభ్రం చేసుకునేటప్పుడు పేస్టు కలిగిన బ్రష్‌ని పంటి ముందు భాగాన చిగుళ్లకు తగలకుండా పైనుంచి కిందకు వృత్తాకారంలో బ్రష్ చేయాలని సూచించారు. అలాగే నోటి లోపల భాగంలో బ్రష్ చేసేటప్పుడు కూడా బ్రష్ అన్ని పన్నులకు తగిలేటట్లుగా రబ్ చేయాలన్నారు. దవడ భాగంలో చాలా సున్నితమైన భాగం కనుక బ్రష్ చాలా జాగ్రత్తగా దవడ పళ్ల పైభాగనా రుద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది మనోహర్, సూర్యనారాయణ, ఉఎన్ఎం కళావతి, ఆశావర్కర్ అంజలీబాయి, మహిళా పోలీస్ చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ పావని

వైద్య విద్య ద్వారా ప్రజలకు సేవ చేయాలి

వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆరేపల్లి శ్రీదేవి - నృత్యాలతో హోరెత్తిన ఆడిటోరియం

ప్రజాశక్తి-అనంతపురం

వైద్య విద్యనభ్యసిస్తున్న మెడికోలు చదువు పూర్తయిన తర్వాత ప్రజలకు సేవలు చేయాలని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి తెలిపారు. సోమవారం స్థానిక మెడికల్ కళాశాల ఆడిటోరియంలో ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య విద్యను ఎంతో భక్తిశ్రద్ధలతో చదువుకుని, ఉన్నత విద్యావంతులుగా, సంస్కారవంతమైన విలువలతో కూడిన వైద్య వృత్తిని చేపట్టినప్పుడే మీ వల్ల ప్రజలకు మేలు కలుగుతుందన్నారు. సమాజానికి సేవ చేసే మహాభాగ్యం డాక్టర్‌గా మీకు ఆ దేవుడు ప్రసాదించారన్నారు. దాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉపాధ్యాయుల నాణ్యమైన వైద్య విద్య బోధనలో, సీనియర్ల సలహాలతో, ఉత్తమ జనాన్ని కలిగి ఉండాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ మాట్లాడుతూ ఎన్ని కోట్లు సంపాదించామన్నది ముఖ్యం కాదని, ఎన్ని లక్షల మందికి వైద్య వత్తి ద్వారా జీవితాన్ని ప్రసాదించామన్నదే ముఖ్యమని తెలిపారు. వైద్య విద్యార్థిని విద్యార్థులకు ఐడెంటిటీ కార్డులను అతిథులు అందించారు. తర్వాత ఆటల పోటీల్లో, ఫైన్ ఆర్ట్స్ పోటీల్లో, ఫొటోగ్రఫీ పోటీల్లో గెలుపొందిన వారికి మూడువందలకు పైగా బహుమతులను అతిథులు చేతుల మీదుగా మెడికోలు అందుకున్నారు. ఆ తర్వాత జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలలో పరిణిత సాయి ప్రదర్శించిన మహిషాసుర మర్దిని కూచిపూడి నృత్యం అందరినీ అలరించింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆరేపల్లి శ్రీదేవి, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ కెఎల్ సుబ్రహ్మణ్యం, అకడమిక్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా, మెడికల్ కళాశాల డాక్టర్లు డాక్టర్ నవీన్ అహ్మద్, డాక్టర్ భీమసేన చారి, డాక్టర్ దుర్గ, డాక్టర్ సుహాసిని, డాక్టర్ శంకర్, డాక్టర్ శాంతిరెడ్డి, డాక్టర్ సరళ, డాక్టర్ భవాని, డాక్టర్ శైలజ, డాక్టర్ ఆశాలత, డాక్టర్ సరోజ, డాక్టర్ పద్మ శ్రావణి, డాక్టర్ ప్రవీణ, డాక్టర్ నిహారిక, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ అబ్దుల్ మజీద్, డాక్టర్ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశి నాయుడు, డాక్టర్ సహజీర్, తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు, నృత్యం చేస్తున్న వైద్య విద్యార్థిని

ఓటమిని జీర్ణించుకోలేకనే దాడులు : టిడిపి

ప్రజాశక్తి-హిందూపురం

పట్టభద్రుల ఎన్నికల్లో ఓటమిని చూసిన వైసిపి అసెంబ్లీ సాక్షిగ టిడిపి ఎమ్మెల్యేలపై దాడులకు పాల్పడినట్లు టిడిపి నాయకులు ఆరోపించారు. అసెంబ్లీలో జరిగిన దాడికి నిరసనగా సోమవారం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో రోడ్డుపై బైఠాయించి టిడిపి నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు డిఇ.రమేష్ కుమార్, రూరల్, లేపాక్షి, చిలుమత్తూరు, మండల కన్వీనర్లు అశ్వర్థ రెడ్డి, జయప్ప, రంగారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ అనిల్ కుమార్, వాణిజ్య విభాగం పార్లమెంట్ అధ్యక్షులు జెపికె.రాము, పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ చంద్రమోహన్ యాదవ్, కౌన్సిలర్లు సతీష్ కుమార్, రాఘవేంద్ర, దుర్గా నవీన్, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి అమర్నాథ్, నాయకులు పరిమళ, నాగలింగారెడ్డి, మారుతీ ప్రసాద్, పూలకుంట సర్పంచు మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : అసెంబ్లీలో దళిత ఎమ్మెల్యే డోలా వీరాంజనేయ స్వామి, టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరిపై వైసిపి ఎమ్మెల్యేల దాడి దుర్మార్గమైనదని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే ఈరన్న పేర్కొన్నారు. సోమవారం ఆయన టిడిపి కార్యాలయంలో విలకరులతో మాట్లాడారు. అసెంబ్లీలో ఇలాంటి దారుణానికి వైసిపి నేతలు పాల్పడడం సిగ్గు చేటన్నారు. రాష్ట్రంలో వైసీపీ పాలన అంతా గుండాయిజంతోనే కొనసాగుతోందని దుయ్యబట్టారు. అసెంబీల్లో సోమవారం జరిగిన ఈ ఘటన రాష్ట్ర చరిత్రలో బ్లాక్‌డేగా నిలిచిపోతుందని చెప్పారు.

పెనుకొండ : టిడిపి ఎమ్మెల్యే బాల వీరాంజనేయస్వామిపై అసెంబ్లీలో జరిగిన దాడిని నిరసిస్తూ శ్రీసత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే, పెనుకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బికె.పార్థసారథి ఆదేశాల మేరకు పట్టణంలో సోమవారం అంబేద్కర్ విగ్రహం వద్ద టిడిపి నాయకులు నిరసన తెలిపారు. దళిత ఓట్లతో గెలిచిన జగన్ మోహన్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా దళిత నాయకుడు డోలా బాల వీరాంజనేయ స్వామి మీద దాడి చేయించటం దుర్మార్గం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చరిత్రలో ఇదొక చీకటి దినం అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చిన్న వెంకటరాముడు, రాష్ట్ర టిఎన్‌టియుసి కార్యదర్శి పాలడుగు చంద్రశేఖర్, సర్పంచ్ శ్రీనివాసులు, నాగరాజు, సుబ్బరాయుడు, సిద్దయ్య, పోతిరెడ్డి, బోయ గాయత్రి, నరసింహులు, బోయ అనిల్ కుమార్, రామకష్ణారెడ్డి, గణేష్ నాయక్, షమున్, నజీర్, శ్యామ నాయక్, ఆంజనప్ప, ఆంజనేయులు, సిద్దప్ప, నాగలూరు శివ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

తనకల్లు : తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలపై అధికార వైసీపీ ఎమ్మెల్యేలు గూండాల మాదిరిగా దాడి చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకే కలంకమని తనకల్లు మండల తెలుగు యువత అధ్యక్షుడు కావాడి ప్రవీణ్ కుమార్ విమర్శించారు. ప్రజాస్వామ్య దేవాలయం అయిన శాసనసభలోనే ఈ దాడి చేయడం చిగ్గుచేటన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేక వైసీపీ గూండాలు దాడికి పాల్పడుతున్నారని ఆయన పేర్కొన్నారు.


అంబేద్కర్ సర్కిల్‌లో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

ధర్మవరం టౌన్ : ప్రజా సమస్యలపై అసెంబ్లీలో గళం విప్పిన టిడిపి దళిత ఎమ్మెల్యే బాలా వీరాంజనేయస్వామిపై వైసీపీ ఎమ్మెల్యేలు దాడులు చేయడం అమానుషమని టీడీపీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు రేగాటిపల్లి వరదరాజులు తెలిపారు. అసెంబ్లీలో వైసీపీ ఎమ్మెల్యేలు విచక్షణ కోల్పోయి దాడులు చేసేదాకా వచ్చారన్నారు. దళిత ఎమ్మెల్యేపై దాడిచేసిన వైసీపీ ఎమ్మెల్యేపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

బుక్కపట్నం : అసెంబ్లీలో దళిత ఎమ్మెల్యే బాల వీరాంజనేయులుపై దాడి హేయమైన చర్య అని ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షురాలు యశోద, టిడిపి మండల కన్వీనర్ మల్ రెడ్డిలు తెలిపారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేపై దాడికి నిరసనగా అంబేద్కర్ విగ్రహం వద్ద టిడిపి నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేపై భౌతిక దాడి చేసిన వైసీపీ ఎమ్మెల్యేలను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా అధ్యక్షురాలు లావణ్య గౌడ్, జంగం వెంకటరాముడు, సయ్యద్‌బాషా, మీసాల మురళి కష్ణ, వాజిద్, కరణం శ్రీరాములు, సుధీర్, అక్కులప్ప, పెదరాశి నాగప్ప పాల్గొన్నారు.

ఓబుళదేవర చెరువు: శాసనసభలో ఎమ్మెల్యేలు డోలా బాలవీరాంజనేయ స్వామి, గోరంట్ల బుచ్చయ్య చౌదరిలపై జరిగిన దాడిని ఖండిస్తూ స్థానిక అంబేద్కర్ సర్కిల్లో అంబేద్కర్ విగ్రహం ఎదుట టిడిపి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ఎమ్మెల్యేలు దాడి చేయడం సిగ్గుమాలిన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ జయచంద్ర, ప్రధాన కార్యదర్శి పిట్ల సుధాకర్, మండోజి ఆరిఫ్ ఖాన్, నిజాంవలి, అంజినప్ప, షబ్బీర్ అలీ, చాంద్‌బాషా, జయచంద్రారెడ్డి, సౌదీ నాగరాజు, షాను, కంచి సురేష్, వైదేహి, అబ్బులు, శ్రీనివాసులు పాల్గొన్నారు.